క్లుప్తంగా

కృష్ణా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జెన్‌పాక్ట్ ఐటీ కంపెనీ జాబ్‌మేళా నిర్వహించనుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టోల్‌చార్జీలపై పునరాలోచన చేయాలి

మద్దిలపాలెం: రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చులను టోల్‌ప్లాజా పెట్టి చార్జీలు వసూలు చేయడానికి ప్రయత్నాలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రోడ్ల నిర్మాణంపై ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో టోల్ చార్జీలు వసూళ్లు చేయాలని సూచించడం ప్రజలపై అదనపు భారం మోపడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికు జాతీయ రహదారిపై టోల్ వసూళ్ల చేస్తున్నారన్నారు. అదే విధంగా రాష్ట్ర రోడ్లపై కూడా ఏర్పాటు చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. 2016 టీడీపీ ప్రభుత్వం ఇదే నిర్ణయంపై ఆలోచన చేసి దాన్ని వాయిదా వేసిందని గుర్తు చేశారు.

వైభవంగా గోదా జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వర, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీగోదా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం (108 కలశాలతో) నిర్వహించారు. హోమం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



గ్రీన్‌గార్డెన్స్ సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టీని పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

మద్రిపాలెం: సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సూచించారు. 53వ వార్డు మద్రిపాలెంలోని గ్రీన్‌గార్డెన్స్ 295 సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రాధాన్యాన్ని బట్టి సచివాలయ సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం హాజరు పట్టీని పరిశీలించారు. సమయపాలన పాటించకపోవడం, సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వంటి ఆరోపణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ లక్ష్మిక్‌కు జెడ్సీ కృష్ణ చీవాట్లు పెట్టారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని అతడికి సూచించారు. జోన్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



పిచ్చి మొక్కలతో నిండిపోయిన నిర్మాణంలో ఉన్న రైతుబజార్ ఆవరణం



ఆరిలోవ కాలనీలో నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలు జీవీఎంసీ నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఆరిలోవ కాలనీలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా సుమారు ఆరేళ్ల క్రితం 42 షాపులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. కూరగాయలు, చికెన్, మటన్ షాపులతో పాటు ఫిష్ మార్కెట్‌కు సంబంధించిన వ్యాపారులు కూడా షాపులు నిర్వహించుకోవచ్చని అప్పట్లో జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఈ షాపులు నిర్మాణం పూర్తయి ఆరేళ్లు గడిచిపోయింది. ఇంత వరకు అధికారులు వాటిని వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో ఈ షాపులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వాటిని కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. దీనికి సమీపంలోనే మద్యం దుకాణం ఉండడంతో మందుబాబులు ఓపెన్ బార్‌గా మార్చేశారు. దర్జాగా కూర్చుని తాగి ఊగుతున్నారు. మరికొందరు రాత్రి వేళ అసభ్యకరమైన వ్యవహారాలకు వినియోగించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

- తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలంలో ఇటీవల జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్ నిర్మించారు. దీని పనులు దాదాపు పూర్తయ్యాయి. ఫ్లోరింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. దీని ఆవరణలో పిచ్చి మొక్కలు దట్టంగా మొలిశాయి. ఆ మొక్కలు చాటున రైతుబజార్ షాపులు గంజాయి బ్యాచ్‌లకు, మందుబాబులకు అనుకూలంగా మారాయి. ఇక్కడ పిచ్చి మొక్కలు తొలగించి రైతు బజార్ అందుబాటులోకి తీసుకువస్తే అసాంఘిక కార్యకలాపాలకు బ్రేక్ పడుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలకు మోక్షం కలిగించాలని ఆరిలోవ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మలేరియా నివారణకు సామూహిక రక్త పరీక్షలు



అప్పుఘర్‌లో ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న మలేరియా సిబ్బంది

ఎంవీపీ కాలనీ: మలేరియా నివారణే లక్ష్యంగా సామూహిక రక్త పరీక్షలు విస్తృతంగా నిర్వహించనున్నట్టు జీవీఎంసీ మలేరియా సబ్ యూనిట్ ఎంపీహెచ్ఈవో శేషుబాబు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి తులసిరాజ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ జోన్–3 సిబ్బంది ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బుధవారం 18వ వార్డు అప్పుఘర్‌తో పాటు 19వ వార్డు ఫిషర్‌మెన్ కాలనీ, శివగణేష్ నగర్‌లలో ప్రజలకు విస్తృతంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ మూడు సంత్సరాలుగా మలేరియా కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలకు రక్తపరీక్షలు నిర్వహించి హెల్దీ క్యారియర్స్‌ను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సూపర్‌వైజర్లు బి.కుమార్, నాగ సతీష్, పలువురు హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



ఠాగూర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయ కళాశాల సిబ్బంది

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా కళాశాలలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రవీంద్రుని జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ సందర్శించిన సందర్భాన్ని, ఆ సమయంలో ఆయన చేసిన ప్రసంగం తదితర విశేషాలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు గణనకు అధికారులు సిద్ధంగా ఉండాలి



పశు గణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ, అధికారులు

ఆరిలోవ: పశు గణన కోసం పశు సంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. పశు గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం డెయిరీ ఫారం వద్ద జిల్లా పశు సంవర్థక శాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఇంటిలోను పశువులు, కోళ్లు, తదితర వాటిని ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లతో కలసి జేడీ డాక్టర్ రామకృష్ణ పశు గణనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభంకానుందన్నారు. పశు గణనకు జిల్లాలో 130 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సిబ్బంది నిబద్ధతతో గణన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామ్మోహన్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



పశు గణన శిక్షణలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు

వీసీ దృష్టికి రహదారి సమస్య

విశాఖ సిటీ: న్యాయ విద్యార్థుల హాస్టల్ వద్ద రహదారి సమస్యను ఓ విద్యార్థి ఏయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి వీసీ స్పందిస్తూ వెంటనే పరిష్కరించారు. ఈ హాస్టల్ పక్కనే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు చేసి రహదారి నిర్మాణం పూర్తి చేయలేదని ఏయూ న్యాయ కళాశాల విద్యార్థి కె.సోమ శేఖర్ వీసీకి మెయిల్ చేశాడు. తరచూ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని అందులో వివరించాడు. వెంటనే స్పందించిన వీసీ.. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు రహదారికి ఏర్పడిన గుంతను పూడ్చారు.

ఐపీఆర్‌లో పీజీ డిప్లమో కోర్సు ప్రారంభం



కోర్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్–ఐపీఆర్‌లో పీజీ డిప్లమో కోర్సును ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఏడాది కాల వ్యవధితో నిర్వహించే ఈ కోర్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే 54 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఐపీఆర్ చైర్‌ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో నోవెల్ పేటెంట్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్ పి.మురళీకృష్ణ, పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా తినేలా 'మధ్యాహ్న భోజనం'



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులు ఇష్టంగా తినేలా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో రైస్ మినహా, మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. బియ్యం బాగా లేకపోతే వాటిని తిప్పి పంపాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజనం కోసమే బడికి వచ్చే విద్యార్థులు చాలా మంది ఉన్నారని, ఇటువంటి పరిస్థితిలో పిల్లలు ఇష్టపడి తినేలా పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు పారిశుధ్యం పనులు పరిశీలించాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. వారంలో రెండు పాఠశాలలు సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఆర్‌బీఎస్ నోడల్ అధికారికి తెలియజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో 61,228 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

10న క్రైస్తవ భక్తి పాటల పోటీలు

బీచ్ రోడ్డు: హోలీ వే ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రైస్తవ భక్తి పాటల పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నట్టు హోలీ వే స్టేట్ లెవల్ క్రిస్టియన్ మ్యూజిక్ అవార్డు 2024 ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీలోని హోలి వే టవర్స్‌లో జరగబోయే ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎల్.శ్యాముల్, పి.శ్రీనివాస, టి.క్రిస్టోఫర్, విజయ రాజు వ్యవహరిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం 98666 81122 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

- దళిత సంఘ నాయకులు



పీఎంపాలెంలో మాట్లాడుతున్నా దళిత నాయకులు

పీఎంపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కొన్ని దళిత సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దళిత నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఎంపాలెంలోని ఆఖరు బస్టాపు వద్ద గల ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర దళిత హితకారిణి సభ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎన్.పి.చక్రవర్తి మాట్లాడారు. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చన్న తీర్పుతో 70 శాతం ఎస్సీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఐక్యంగా ఉన్న ఎస్సీలను విభజించి లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎస్సీలకు సంబంధించి ఏం తెలుసని ప్రశ్నించారు. ఈ తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. దళిత రాజకీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నిడగట్లు నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి బోని అప్పలరాజు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడిగట్లు రాజారావు, గుడివాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూలో ఖాళీ స్థలాల పరిశీలన



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు పరిశీలించారు. ఇక్కడ ఏయూ స్థలం కబ్జాకు గురవుతోందన్న సమాచారంలో మంగళవారం అర్ధరాత్రి ఇంజినీరింగ్ సిబ్బందిని పంపించి వివరాలు తెలుసుకున్నారు. ఉదయం రిజిస్ట్రార్ స్వయంగా ఆ స్థలాలను సందర్శించారు. ఏయూ స్థలం కబ్జాకు గురికాలేదని గుర్తించారు. అదే విధంగా పలు చోట్ల ప్రహరీ దెబ్బతినడాన్ని గమనించి వెంటనే మరమ్మతు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

11న జూలో చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ: ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న జూ పార్కులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులు, ప్రోత్సాహకాలతో పాటు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. చిత్రలేఖనానికి అవసరమైన పెన్సిల్, క్రెయాన్స్, స్కెచ్, వాటర్ కలర్స్, తదితర సామగ్రిని విద్యార్థులు తమ వెంట తీసుకురావాలని ఆమె సూచించారు. చిత్ర లేఖనానికి అవసరమైన పేపర్లు జూ లో అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 94408 10213 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కేటగిరీ–1లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'మై ఫేవరేట్ ఎలిఫెంట్', కేటగిరీ–2లో 6 నుంచి 10వ తరగతి వరకు 'ది మేజెస్టిక్ ఎలిఫెంట్ గార్డియన్ ఆఫ్ ది ఫారెస్ట్', కేటగిరీ–3లో ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు 'ఎలిఫెంట్స్ యాజ్ ఎకోసిస్టిమ్ ఇంజినీరింగ్'పై చిత్రాలు వేయాల్సి ఉంటుందని క్యూరేటర్ తెలిపారు.

దాడులపై హైకోర్టును ఆశ్రయిస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న దేవానంద్

ఎంవీపీ కాలనీ: గత ఐదేళ్లలో రాష్ట్రంలో 750 మంది దళితులపై దాడులు జరిగాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆరోపించారు. జాతీయ క్రైమ్ రిపోర్ట్ ఈ విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. ఆయా దాడులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర గవర్నర్‌తో పాటు ఎస్సీ కమిషన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ అంశంపై త్వరితగతిన చర్యల కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పౌరుడు దేశభక్తిని చాటాలని కోరారు. ప్రధాని పిలుపు మేరకు దేశంలోని ప్రతి ఇంటిపై ఈ నెల 15న జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అమ్మ పేరుతో చెట్టు నాటే కార్యక్రమం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

16న గౌతు లచ్చన్న జయంత్యుత్సవాలు



సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవర ప్రసాద్

మద్దిలపాలెం: సర్దార్ గౌతు లచ్చన్న జయంత్యుత్సవాలను ఈనెల 16న విశాఖలో గ్రీన్‌పార్క్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాలకు రావాలంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యవర ప్రసాద్ బుధవారం విజయవాడలో కలిసి ఆహ్వానించామన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు డి.శ్యామ్ సుందర్, శేషు, గుత్తల మధు, వైన్య, ఆశా ప్రియ గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

12 నుంచి మెగా ఫ్రీడమ్ క్విజ్ పోటీలు

విశాఖ సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో మెగా ఫ్రీడమ్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని విద్యా సంస్థల నుంచి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ క్విజ్, రాత, మౌఖిక పరీక్ష.. ఇలా మూడు రౌండ్లలో ఈ టెస్ట్ ఉంటుందని వివరించారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆన్‌లైన్ క్విజ్, 13న ఏయూలోని అంబేడ్కర్ చైర్ ప్రాంగణంలో రాత పరీక్ష, 14న మౌఖిక పరీక్ష ఉంటుందని, అదే రోజు బహుమతుల ప్రదానోత్సవం కూడా జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తరగతి, జెండర్, విద్యా సంస్థతో సంబంధం లేకుండా ఎవరైనా అయిదుగురు బృందంగా ఏర్పడి పోటీలో పాల్గొనవచ్చని సూచించారు. విద్యా సంస్థల నుంచి ఎన్ని జట్లు అయినా పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా చేసుకోవచ్చన్నారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు క్యాష్ అవార్డులు కూడా అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9182381947/9700066832 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చేనేత కళాకారులకు సన్మానం



చేనేత కళాకారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన చేనేత కళాకారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆత్మీయంగా సత్కరించారు. చేనేత, జౌళి శాఖ అధికారులతో కలిసి కళాకారులు ఎ.అప్పల సూర్యారావు, ఎస్.భోగేశ్వర రావు, కె.చినబాబు బుధవారం కలెక్టర్‌ను అతని చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి.. ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం కళాకారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి.. చేనేత వస్త్రాలతో సన్మానించారు. చేనేత, జౌళి శాఖ ఏడీ వి.పద్మ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్ బుడితి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో ఆప్కో స్టాల్

కలెక్టరేట్ ప్రాంగణంలో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీ పద్మ తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



అగనంపూడిలో పట్టుకున్న పీడీఎస్ రైస్

మహారాణిపేట: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)కు చెందిన బియ్యాన్ని బుధవారం పౌర సరఫరాల శాఖాధికారులు పట్టివేశారు. డీఎస్‌వో సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. డాబాగార్డెన్‌లో అనధికారికంగా ఓ వాహనంలో రవాణా చేస్తున్న పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. అగనంపూడి, పెదమాదక ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తగరపువలసలో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4,700 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు.

రైల్వేస్టేషన్‌లో 14.5 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.ఆర్.బిషోయ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. షోలాపూర్ జిల్లా, మహారాష్ట్రకు చెందిన మహిబూబ్ గులాబ్‌షేక్, తమిళనాడు మధురైకు చెందిన ఎం.మంతియన్ అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని గుర్తించారు.ఇద్దరినీ అదుపులోకి తీసుకుని సుమారు రూ.72,500 విలువైన 14.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.